
ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహలను సన్మానిస్తున్న వెస్లీ చర్చి సభ్యులు

వెస్లీ చర్చిలో సమస్యల పరిష్కారానికి కృషి

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ బాకారంలోని వెస్లీ చర్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. చర్చి పరిసర ప్రాంతాలలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఆదివారం వెస్లీ చర్చి ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహలకు సత్కరించారు. కార్యక్రమంలో వెస్లీ చర్చి ప్రతినిధులు థాంసన్, జయరావు, శ్యామ్యూల్, సైమన్, సునీల్, దివాకర్, మాణిక్‌రావు, జయసన్, డేవిడ్‌పాల్, డాక్టర్ స్టీవెన్‌కుమార్, ఎడ్విన్, మైఖేల్, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్, నాయకులు అరుణ్, వెంకటేష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిని నింపిన హరికథాగానం


హరకథాగానం చేస్తున్న రమణమూర్తి

చిక్కడపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన హరికథాగానం భక్తిని నింపింది. భక్తులను ఆకట్టుకునేలా హరికథా భాగవతావర్ రమణమూర్తి హరికథను వినిపించారు. ప్రతినెలా రెండు రోజుల పాటు ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో కళారూపాల ప్రదర్శన ఉంటుందని ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ 1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు జి.నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. గోల్కొండ క్రాస్‌రోడ్ పరిధిలోని ఏక్‌మినార్ మసీదు, కృష్ణాకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, స్పెన్సర్ పరిధిలోని శివాలయం, రాజాడీలక్స్ తదితర ప్రాంతాల్లో 11 నుంచి 1.30 గంటల వరకు, దయారామార్కెట్ పరిధిలోని రిసాల, సాగర్‌లాల్ ఆస్పత్రి ప్రాంతాల్లో 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు, శాస్త్రినగర్ పరిధిలోని మోహన్‌నగర్, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో 3నుంచి 5 వరకు, అనుగ్రహ, గాంధీనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10నుంచి 1, సెవెన్ టెంపుల్, ఎన్‌టీఆర్‌మార్గ్, బ్యాంక్‌ఆఫ్ బరోడా పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.


కలర్‌బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లు పొందిన విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ పొందాలి

చిక్కడపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ పొందాలని వారి రక్షణకు అది ఎంతో ఉపయోగపడుతుందని హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. కృష్ణ, మీర్ వహాజ్ అలీఖాన్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ గాంధీనగర్ కెనరాబ్యాంక్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ టైక్వాండో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ బి. కృష్ణ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్, కలర్‌బెల్ట్ సర్టిఫికెట్‌ల ప్రదానకార్యక్రమం కలర్‌బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లు పొందిన విద్యార్థులు తైక్వాండో ప్రదర్శనలు జరిగాయి. ఈసందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన కృష్ణ, మీర్ వహాజ్ అలీఖాన్‌లు మాట్లాడుతూ సర్టిఫికెట్లు, బెల్ట్‌లు పొందిన విద్యార్థులను అభినందించారు. మహిళలు కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే రక్షణ కోసం ఉపయోగ పడుతుందన్నారు. ఎగ్జామినర్ మాస్టర్ సంజయ్, లక్ష్మీనారాయణ, కోచ్‌లు మనీష్, స్వామి, రాకేష్, అనిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.


సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్, తదితరులు

విజ్ఞానాన్ని వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లిలో డాక్టర్ అంబేడ్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల స్థాయి విద్యార్థులకు నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యారంగంలో వస్తున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించే అవశ్యకత ఉందన్నారు ఉత్తమంగా చెప్పిన విద్యార్థులనువారు అభినిందనించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

కవాడిగూడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ అడ్వకేట్స్‌కాలనీలో గల బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో ఆదివారం కన్పించారు. ఈ పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ జి రచనశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. పవిత్ర కార్తీక మాసంలో ప్రతిరోజు దీపాలు వెలిగించడం సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, బస్తీ నాయకులు ప్రేమ్‌కుమార్, ఆలయ అర్చకులు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సత్యనారాయణ స్వామి వ్రతం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'కేంద్రానికి మాలల సత్తా చాటాలి'

నల్లకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా ఏకీకృతమై ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వానికి మాలల సత్తాచాటాలని జాతీయ మాలల జేఏసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది ఎస్.ఇ.మహేందర్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహగర్జనకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం హైదర్‌గూడలో మాలల న్యాయవాదుల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఇంటికి ఇద్దరు చొప్పున మాలలు ఉప్పెనలా తరలివచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ సత్తా చూపాలని కోరారు. ఎస్సీలు రాజ్యాధికారానికి దూరం చేసేందుకే మందకృష్ణ అగ్రవర్ణాల చెంతకు చేరారని ఆయన ఆరోపించారు.

మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు విశ్వాసం

బర్కత్‌పుర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, అందుకే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించిందని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు అన్నారు. మహారాష్ట్ర విజయం అన్ని రాష్ట్రాలకు ఆదర్శమన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో మహారాష్ట్రలో విజయం సందర్భంగా విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని అన్నారు. 2028లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, శ్యామ్‌రాజ్, క్షీరసాగర్, కృష్ణకుమార్, అరవింద్, పందిర్ల ప్రసాద్, కేశబోయిన శ్రీధర్ పాల్గొన్నారు.

బల్దియాలో ఎలుకల బెడద

ఫైళ్లు, కంప్యూటర్ వైర్లు ధ్వంసం

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో ఎలుకల బెడద ఎక్కువైంది. పలు విభాగాల్లో ఫైళ్లలోని పత్రాలు, కంప్యూటర్ వైర్లను కొరుకుతున్నాయి. వైర్లు పాడవుతుండడంతో కంప్యూటర్లు పని చేయక ఈ- ఆఫీస్‌లో ఫైళ్ల పరిశీలన నిలిచిపోతోంది. మాన్యువల్‌గా వచ్చే ఫైళ్ల పరిశీలనలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. ఫైళ్లను సైతం ఎలుకలు కొరుకుతుండడంతో కొన్ని కాగితాలు మిస్సవుతున్నాయి. ఓ విభాగంలో కీలక ఫైల్‌ను ఎలుకలు తినడంతో మరోసారి పూర్తి వివరాలు పంపాలని కేంద్ర కార్యాలయం నుంచి ఓ సర్కిల్ ఆఫీస్‌కు ఆదేశాలు వెళ్లాయి. ఫైళ్లను బీరువాలు, కప్‌బోర్డుల్లో పెట్టినా ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ఓ బహుళ అంతస్తుల భవన నిర్మాణ ప్రతిపాదనలకు సంబంధించిన ప్లాన్‌ను ఎలుకలు కొరికాయి. దీంతో మరోసారి ప్లాన్ సమర్పించాలని అధికారులు సూచించారు. పలు విభాగాల్లోని అదనపు కమిషనర్ కార్యాలయం పేషీల్లో ఎలుకలు పట్టేందుకు చిన్న బోన్లు ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల క్రితం ఆధునీకరణ పనులు చేసిన విభాగాల్లోనూ ఎలుకలు కనిపిస్తుండడం గమనార్హం. అధికారుల యాంటీ రూమ్‌లు, రెస్ట్ రూముల్లోనూ ఎలుకలు వస్తున్నాయని భవన నిర్వహణ అధికారులకు సిబ్బంది ఫిర్యాదు చేస్తున్నారు.


ఎలుకలు కొరికిన కంప్యూటర్ వైరు

దక్షిణ డిస్కంలో నెలరోజుల్లో రెండు చోట్లకు బదిలీ!

నచ్చిన చోటకు పోస్టింగుకు హెచ్‌ఆర్ విభాగంలో చక్రం తిప్పిన ఓ ఉద్యోగి

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ డిస్కం హెచ్‌ఆర్ విభాగంలో కొంతమంది ఉద్యోగులు నచ్చినోళ్లకు ఇష్టానుసారంగా పోస్టింగులిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నెలరోజుల క్రితం ఇంజనీర్లతో పాటు పలు విభాగాల్లో ఉద్యోగులను విద్యుత్‌శాఖ భారీగా బదిలీలు చేసింది. టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అక్టోబరు 16 వ తేదీన మేడ్చల్ సర్కిల్‌కు బదిలీ చేయడంతో ఆ పోస్టులో చేరాడు. నెలరోజులు పూర్తికాకముందే అ ఉద్యోగిని తిరిగి కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీచేసి మరో ఉద్యోగికి అక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం అక్కడకు బదిలీచేసిన ఉద్యోగి పెద్దఎత్తున పైరవీ చేయడంతోపాటు హెచ్‌ఆర్‌వింగ్‌లోని కొంతమంది అవినీతి అధికారుల అండతో ఆ పోస్టింగ్‌లో చేరినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిస్కం ఆదేశాలు పాటిస్తూ సాధారణ బదిలీల్లో వెళ్లిన ఉద్యోగి 'నన్ను ఆ స్థానం నుంచి ఎందుకు బదిలీచేశారు' అని ఉన్నతాధికారులను అడిగినా స్పందన లేకపోవడంతో ప్లకార్డుతో కార్పొరేట్ ఆఫీస్‌లో మౌనప్రదర్శన నిర్వహించాడు. గతంలో జరిగిన సాధారణ బదిలీల్లో సైతం హెచ్‌ఆర్ విభాగంలోని కొంతమంది సీఎండీకి తప్పుడు నివేదికలిచ్చి అనేక అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. తమకు అడిగినంత ఇస్తే ఒకలా, లేకపోతే మరోలా నిబంధనలు మార్చి సాధారణ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలున్నాయి.

డిజిటల్ మీడియా ప్రీమియర్ లీగ్ జెర్సీ ఆవిష్కరణ

హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీష్‌రావు

యూసుఫ్‌గూడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ పోలీస్‌లైన్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన డిజిటల్ మీడియా ప్రీమియర్ లీగ్ జెర్సీ ఆవిష్కరణలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రొత్సహించాలని, క్రీడల ద్వారా యువత ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రీడలను ప్రొత్సహించేందుకు ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్శిటీని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. నేటి తరానికి క్రీడలు, వ్యాయామం ఎంతో ముఖ్యమని, వాటికోసం రోజులో కనీసం కొంత సమయం కేటాయించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు బ్యాట్, బాల్ పట్టుకుని సందడి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, లీగ్ నిర్వాహకుడు వినయ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి హరీష్‌రావు


ఉసిరికచెట్టు పూజలో సూర్యప్రకాష్, వినయ్‌కుమార్, పద్మావతి

ఐక్యతను పెంపొందించే వనభోజనాలు

చిక్కడపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా నిర్వహించే కార్తీక వనభోజనాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని బీజేపీ సికింద్రాబాద్ జిల్లా జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి. సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ పార్కులో కార్తీక వనభోజన కార్యక్రమంతో పాటు ఉసిరిక చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి వివేక్‌నగర్ అంజనేయస్వామి ఆలయం పూర్వ ఛైర్మన్ పద్మాసూర్యప్రకాష్, ప్రముఖ పిల్లల వైద్యులు డా. మనోహరరావు, వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పద్మావతి, హనుమంతరావు, ప్రభాకర్ యాదవ్, జైని రమేష్, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పూజలో సూర్యప్రకాష్, వినయ్‌కుమార్, పద్మావతి తదితరులు

కవాడిగూడలో మహాపడిపూజ

కవాడిగూడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ భాగ్యలక్ష్మినగర్‌లో ఆదివారం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పేరుస్వామి వల్లాలశ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి ఎం మల్లికార్జున్ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో అయ్యప్ప భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్పస్వామి పూజ, భజన కార్యక్రమాలతో పరిసరప్రాంతాలు మారుమ్రోగాయి. ఈ పూజ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠాజైసింహ, బీఆర్ఎస్ నగర నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో స్వామి వై శ్రీనివాస్ రావు, దుర్గాస్వామి, వల్లాల రవియాదవ్, సత్యనారాయణ. ముఖేష్, వేణుయాదవ్, రాకేష్‌కుమార్, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.


సీఎంఈః ఆన్ రివిజన్ హిప్ రిప్లేస్‌మెంట్ సదస్సులో పాల్గొన్న డాక్టర్లు

పెరుగుతున్న తుంటి మార్పిడి సర్జరీలు

సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. ఉదయ్ కృష్ణ మైనేని

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హిప్ జాయింట్ సమస్యలతో రివిజన్ హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీలు పెరుగుతున్నాయని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, ప్రోగ్రామ్ కోర్సు డైరెక్టర్ డా.ఉదయ్ కృష్ణ మైనేని అన్నారు. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి సహకారంతో మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం సీఎంఈః ఆన్ రివిజన్ హిప్ రిప్లేస్‌మెంట్ సదస్సు నిర్వహించారు. తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో పెరుగుతున్న ప్రాబల్యం, కోవిడ్-19 తర్వాత అధిక స్టెరాయిడ్ వాడకం, గాయాల కారణంగా ప్రభావితమైన రోగుల్లో సంభవించే సమస్యలు, వృద్ధ రోగుల్లో ఏర్పడుతున్న సవాళ్లను పరిష్కరించే విధానాలపై చర్చించారు. యశోద ఆస్పత్రిలో నిర్వహించిన లైవ్ సర్జరీలు, కాన్ఫరెన్స్‌లోని హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్‌లో ఆధునాతన వైద్య పద్ధతులను ప్రదర్శించారు. యశోద ఆస్పత్రి డైరెక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ ఆర్థోపెడిక్ కేర్‌ను అభివృద్ధి చేయడంపై ఆస్పత్రి ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. ఈ సందస్సులో దేశవ్యాప్తంగా సుమారు 250 మంది వైద్య ప్రతినిధులు పాల్గొన్నారు.

2 నుంచి మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్-2 మాక్ టెస్టులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్ష రాసే మైనార్టీ అభ్యర్థులకు డిసెంబరు 2, 3, 9, 10 తేదీల్లో రెండు ఫ్రీఫుల్ లెంగ్త్ మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలుంటాయని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మహ్మద్ ఇలియాస్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు గన్‌ఫ్రౌండీలోని జామియా నిజామియా కాంప్లెక్స్‌లో సంప్రందించాలని సూచించారు. 040-23236112 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే చర్యలు

కార్పొరేటర్ కన్నె ఉమాదేవి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కాంట్రాక్టర్లను హెచ్చరించారు. రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదివారం డివిజన్‌లోని లింగంపల్లి బాలప్పబాడ బస్తీలలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగ తిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీమాయాదవ్, సురేష్, రాధిక, సంతోష్ పాల్గొన్నారు.

'కేంద్రం రైతులకు, కార్మికులకు అన్యాయం చేస్తోంది'

నల్లకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతూ రైతుకూలీ, కార్మిక వర్గాలకు తీరని అన్యాయం చేస్తోందని ఎం సీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని, పార్లమెంట్ సాక్షిగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మిక చట్టాలను సవరించిన విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 26న దేశవ్యాప్తంగా రైతు, కూలీ, కార్మిక ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలకు, సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం విద్యానగర్‌లోని ఎంసీపీఐ(యు) కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బహుళజాతి సంస్థలకు దేశ సంపదను ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇచ్చి జయప్రదం చేయాలన్నారు.

గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వం గడువు పొడిగింపు

నల్లకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు గడువు ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సొసైటీలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఈనెల 25 శని, ఆదివారాలు బ్యాంకులకు సెలవు అయినందున చాలా మంది డీడీలు తీయలేకపోయినట్లు తెలుస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని మరో మూడు రోజులు పొడిగించినట్లు వారు తెలిపారు. వివరాలకు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరిట బ్యాంకు డీడీ దరఖాస్తు ఫారానికి జత చేయాలని, వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో గల టీవీ కాలనీ ఫేస్ - 4 ప్లాట్ నెంబర్ 198లో గల సొసైటీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సంప్రదించాలని, లేదా 7790681212, 9393353519 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

రోడ్డు కబ్జా చేసి నిర్మాణం.. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ రామాలయం వెనుక వీధిలో రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ మహ్మద్ ఖాదర్ మోహినుద్దీన్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, కార్పొరేటర్ సునీతాప్రకాష్‌గౌడ్‌లకు స్థానికులు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇంటి నెంబర్ 1-9-62/2;ఎ ఎదురుగా గల మరో ఇంటి యజమాని కొంత కాలం క్రితం రోడ్డు స్థలాన్ని వదిలి ఇంటి నిర్మాణం చేశాడు. అప్పుడు వదిలిపెట్టిన రోడ్డు స్థలాన్ని ఆక్రమణ కోసం నిర్మాణ పనులు ఆదివారం చేపట్టారు. దీంతో స్థానికులు రోడ్డు స్థలంలో నిర్మాణం చేయొద్దని అడ్డుకున్నారు. అయినా సదరు వ్యక్తి పట్టించుకోకుండా ఆక్రమణ చేపట్టారు. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నిర్మాణం వల్ల రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గతంలో వదిలిపెట్టిన రోడ్డు స్థలంలో తిరిగి నిర్మాణ పనులు చేపట్టడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్, డీఎంసీలు స్పందిస్తూ రోడ్డు ఆక్రమణపై వెంటనే చర్యలు చేపడతామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.


రామాలయం వెనుక వీధిలో రోడ్డు అక్రమించి కొనసాగుతున్న నిర్మాణం

కేంద్ర సాయుధ మాజీ పోలీసు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాయుధ మాజీ పోలీసు సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది సంక్షేమం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌రెడ్డి, మామిళ్ల రాజులు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్‌లలో విధులు నిర్వహిస్తూ దేశ సరిహద్దులలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2012 సెప్టెంబర్ 23వ తేదీన అప్పటి యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఆఫీసు మెమోరాండం ప్రకారం సైనిక దళాలకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు మాజీ సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి వర్తింపచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. తెలంగాణవ్యాప్తంగా డిఫెన్స్ ఫోర్సెస్‌కు ఇస్తున్న ఇంటి పన్ను రద్దును మాజీ సీఆర్‌పీఎఫ్ సభ్యులకు వర్తింపచేయాలన్నారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ సీట్లలో సీఆర్‌పీఎఫ్ సభ్యుల పిల్లలకు క్యాబ్ కోటాను వర్తింపచేయాలన్నారు. తమ సభ్యుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వ ధర ప్రకారం ఇంటి స్థలం మంజూరు చేయాలని, సీఆర్‌పీఎఫ్ క్యాంటీన్లలో మద్యం సరఫరా నిమిత్తం లైసెన్స్‌ను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి ఎం.వెంకటరెడ్డి, సలహాదారు ఎస్.ఎన్.రెడ్డి, భగవంతు, సి.బిరామకృష్ణ శ్రీనివాస్‌రెడ్డి, వి.భారతి, ప్రేమారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.



అమరవీరుల కుటుంబసభ్యులను సన్మానిస్తున్న పోలీసు బలగాల సిబ్బంది


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్, ప్రొ.వినోద్‌కుమార్

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు కోసం న్యాయపోరాటం

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాలకు ప్రయోజనం చేకూర్చేందుకు తీసుకున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు కోసం న్యాయపోరాటం చేస్తూనే మరోవైపు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఈడబ్ల్యూఎస్ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం 2019లో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉద్యోగ అవకాశాలు లభించడం లేదన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిసి రాజ్యాధికారం సాధిస్తేనే అగ్రవర్ణాలు చేసే కుట్రలు, కుతంత్రాలు తగ్గుతాయన్నారు. బీసీలు రాజ్యాధికారంలోకి రావడానికి తాను కృషి చేస్తానన్నారు. బీసీల కోసం రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఐక్యత లేకపోవడం వల్లనే 4 శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ బాగయ్య, బీసీ రాజ్యాధికార సమితి మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల కవిత, ఉపాధ్యక్షురాలు హైమావతి, కార్యదర్శి మంజుల, నాయకులు డి.కొమురయ్య, కుమారస్వామి యాదవ్, యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కిషోర్, ప్రధాన కార్యదర్శి అనిల్, నగర అధ్యక్షురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ బహూకరిస్తున్న కిరణ్

వాలీబాల్ విజేత చెన్నై

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): చెరుకూరి విఠల్ స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌లో చెన్నై జట్టు విజేతగా నిలిచింది. నగరంలో రెండ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్లో చెన్నై జట్టు 25-22, 25-23తో ముంబైపై గెలిచి, ట్రోఫీ సొంతం చేసుకుంది. జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, టీజీఎస్ఆర్టీసీ డీవీఎం జి.కిరణ్ రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ ప్రదానం చేశారు.

మాలల సింహాగర్జనను విజయవంతం చేయాలి

నల్లకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్గీకరకణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో మాలల సింహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రమాబాయ్ మాలల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి కోరారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మాలలు ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ వర్గీకరణ వల్ల జరిగే నష్టాన్ని వివరిస్తూ అందరినీ చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. మాలల సింహాగర్జన కోసం మాలలంతా పెద్దఎత్తున తరలివచ్చి తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.